# మున్సిపల్ ఎన్నికలు మా ప్రభుత్వ పాలనకు రిఫరెండం

### పురపాలక ఎన్నికలను సెమీ ఫైనల్స్ గా భావిస్తున్నాం
### పదేళ్ల దొరలపాలనలో పేదలకు ఒరిగింది శూన్యం
### ఖమ్మం, మహబూబాబాద్, జనగాం జిల్లాల్లో విస్తృత ప్రచారం
### తొర్రూరు మున్సిపాల్టీని దత్తత తీసుకుంటా
### మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**విశ్వంభర,పాలేరు:** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పురపాలక ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం సెమీ ఫైనల్స్‌గా భావిస్తోందని, ఈ ఎన్నికల్లో తమకు సరైన పోటీయే లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల నేపథ్యంలో మంత్రి పొంగులేటి శనివారం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం నుంచి ప్రారంభించి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, వర్ధన్నపేట జనగాం మున్సిపాలిటీల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. తొలుత ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 25వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖా రావం పూరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోంది. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా?" అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు. గతంలో పంచాయితీ రాజ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మంచి ఆధిక్యత వచ్చిందని, అదే ఫలితం ఇప్పుడు పురపాలికల్లో కూడా పునరావృతం కాబోతోందని అన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకమై పనిచేసే వారికే కాంగ్రెస్ టిక్కెట్లు ఇస్తున్నామని అన్నారు. తమతో కలిసి వచ్చే పార్టీలకు కాంగ్రెస్ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని అన్నారు. గతంలో ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు ప్రతి ఎన్నికను ప్రభుత్వ పనితీరుకు రిఫరెండం అని ప్రకటించి భంగపడ్డారని, ప్రతి ఎన్నికలలోను ప్రజలు వారిని తిరస్కరించారని గుర్తు చేశారు. ఈసారి కూడా ఆ దొరవారు భంగపడితే ఏం చేస్తారో చెప్పాలని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాటను నిలబెట్టుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. "మేము మాటలు చెప్పేవాళ్లం కాదు.. పనిచేసే వాళ్లం. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు రూ. 5 లక్షల సాయం అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, ?500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, ఇవే తమ ప్రభుత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సంస్కరణలు మరియు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలంటే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ మరియు పౌర సేవలను వేగవంతం చేయడం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ఈ ఎన్నికల్లో పార్టీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని జోస్యం చెప్పారు.

**తొర్రూరు మున్సిపాల్టీని దత్తత తీసుకుంటా: మంత్రి పొంగులేటి**

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొర్రూరు మున్సిపాల్టీ పరిధిలో పర్యటిస్తూ ఈ తొర్రూరు మున్సిపాల్టీని తాను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న తాను తన నియోజకవర్గంతో సమానంగా ఈ మున్సిపాల్టీని అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నిసంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ ఎమ్మెల్యే, ఎంపీతో సహా అందరూ కాంగ్రెస్ వారేనని తొర్రూరు పురపాలికలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రగతి పథకాల అమలు మరింత సులువు అవుతుందన్నారు. ప్రభుత్వం పేదల పక్షపాతి అనే విషయం గడచిన రెండేళ్లలో అమలు చేస్న?న్న ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పాటు వివిధ పథకాలు స్పష్టం చేస్తున్నాయని చెబుతూ కాంగ్రెస్ అభ్యర్థి శ్రవణ్‌ను గెలిపించాలని మంత్రి పొంగులేటి కోరారు.

## ఆర్టీసీ బస్ భవన్‌లో అగ్ని ప్రమాదం

విశ్వంభర, హైదరాబాదు:



హైదరాబాదు నగరంలోని ఆర్టీసీ బస్ భవన్‌లో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సెల్లార్ లో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగా అక్కడ ఉన్న యూపీఎస్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భవనంలో ఉన్న సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాద సమాచారంతో చిక్కడపల్లి పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకుని భద్రతా చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదానికి కారణాలపై విచారణ కొనసాగుతోంది.

## దోమల నివారణకు చర్యలు: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



**విశ్వంభర, అంబర్‌పేట్:** బాగ్ అంబర్‌పేట్ డివిజన్ పరిధిలో దోమల బెడద విపరీతంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, డివిజన్ కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డిల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన వారు శనివారం సోమసుందర్నగర్ కాలనీ పార్కులో ఎంద మాలజీ విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశమై దోమల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్తీలు, కాలనీల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మందు పిచికారీ చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యమని వారు తెలిపారు.

## ఫిబ్రవరి 13 వరకు ప్రజావాణి రద్దు



**విశ్వంభర,నారాయణపేట:** మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా ఫిబ్రవరి 13 వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్‌పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ప్రజావాణి లో దరఖాస్తులు సమర్పించేందుకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహిస్తామన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు సమ్మక్క-సారమ్మలకు మొక్కులు



**విశ్వంభర, మేడారం:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం వనదేవతలైన సమ్మక్క--సారమ్మలకు మొక్కులు చెల్లించుకున్నామని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ తెలిపారు. శనివారం మేడారం సమ్మక్క-సారమ్మలను దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు గౌడ్ మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవమైన సమ్మక్క-సారమ్మల చల్లని దీవెనలతో బహుజనుల రాజ్యాధికారం రావాలని ఆకాంక్షించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధననే ముఖ్య లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఆ దిశగా బహుజనులకు శక్తిని ప్రసాదించాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు యెలి కట్టె విజయ్ కుమార్ గౌడ్, ఎస్. దుర్గయ్య గౌడ్, అంబాల నారాయణ గౌడ్, బైరు శేఖర్ గంగపుత్ర, సింగం నాగేష్ గౌడ్, బాలగోని వెంకటేష్ గౌడ్, పోతగని ఐలేన్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ




**విశ్వంభర, గుండాల;** అనంతారంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తుమ్మ మరి రెడ్డి జ్ఞాపకార్థముగా ఆయన తనయుడు తుమ్మ సురేందర్ రెడ్డి క్రీడా దుస్తులను ప్రధానోపాధ్యాయులు పి. రజనీ కుమారి సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. దాత సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ పాఠశాల దాతలకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం సుధాకర్, స్వీపర్ ఎన్ రమేష్, స్కావెంజర్ ప్రమీల, అంగన్వాడీ ఆయా నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచండి
### పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**విశ్వంభర, పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు బిహెచ్ఇఎల్ చౌరస్తా నుండి రుద్రారం గణేష్ గడ్డ మీదుగా సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని.. సర్వీస్ రోడ్లు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చి.. ప్రధాన రహదారి పనులను చేపట్టాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారి సంస్థ అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామచంద్రాపురం, పటాన్చెరు, ముత్తంగి ప్రాంతాలలో రహదారి విస్తరణ పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్లు అసంపూర్తిగా ఉండటం మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు వాహనదారులు ప్రమాదాలకు గురై చనిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వైపు నుండి సంపూర్ణ సహకారం అందిస్తున్నా పనులు ఎందుకు పూర్తి కావడం లేదని ఆయన ప్రశ్నించారు. నెల రోజుల్లో గా సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలని, లేని పక్షంలో ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రహదారుల నిర్మాణ సమయంలో ప్రభుత్వ శాఖలతో ఇబ్బందులు ఎదురైతే సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని జాతీయ రహదారుల సంస్థ డి. ఈ రామకృష్ణను ఆదేశించారు.

## ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అగ్రి 'లుక్'

### సిట్ నోటీసుల వేళ హిమాన్షు ఆసక్తికర పోస్ట్
### పొలం పనుల్లో గులాబీ బాస్ బిజీబిజీ
### సోషల్ మీడియాలో వైరల్



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ సెగలు పతాకస్థాయికి చేరుకున్నాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ పరిణామం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య చిచ్చు రాజేసింది. ఒకవైపు పార్టీ నేతల విమర్శలు, మంత్రుల కౌంటర్లతో రాజకీయం హీటెక్కిపోతుంటే..గులాబీబాస్ మాత్రంఅత్యంత ప్రశాంతంగా తన వ్యవసాయ పనుల్లో నిమగ్నమై కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

**'మొదలు రైతు కదా..'**

రాజకీయాల్లో ఇంత రచ్చ జరుగుతున్నా, కేసీఆర్ మాత్రం తనదైన శైలిలో ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో గడుపుతున్నారు. తాజాగా కేటీఆర్ కుమారుడు హిమాన్షు తన ఫేస్‌బుక్ ఖాతాలో షేర్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కేసీఆర్ పొలంలో నిలబడి, ఒక ట్రాక్టర్ నుంచి మొక్కలను అన్‌లోడ్ చేయిస్తున్న కార్మికులకు సూచనలు ఇస్తూ కనిపించారు. ఈ ఫోటోకు హిమాన్షు క్యాప్షన్ జోడిస్తూ.. "మొదలు రైతు కదా, ఆ గుండెకి మట్టిని తాకితేనే సంతృప్తి ఉంటది. ఎంత ఎత్తుకు ఎదిగినా, మన మూలాలను ఎప్పటికీ మర్చిపోని వ్యక్తిత్వానికి కేసీఆర్ నిలువెత్తు నిదర్శనం" అంటూ పేర్కొన్నారు.

నోటీసులు అందిన సమయంలో సాధారణంగా ఎవరైనా ఆందోళన చెందుతారు. కానీ కేసీఆర్ మాత్రం ఎంతో కూల్‌గా, తన మూలాలైన వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండటం చూసి నెటిజెన్లు విస్తుపోతున్నారు. "గులాబీ బాస్ లెక్కే వేరు.. ఎంత ఒత్తిడి ఉన్నా తన పని తాను చేసుకు పోతున్నారు" అంటూ నెటిజెన్లు కామెంట్ చేస్తున్నారు.

## బహుమతి ప్రధానం చేసిన సర్పంచ్

విశ్వంభర, నాగారం: సంక్రాతి పండుగ సందర్భం గా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నాగారం మండలం నాగారం బంగ్లా గ్రామంలో కీ.శే లు భయ్యం మల్లయ్య -,చీరిక లక్ష్మారెడ్డి జ్ఞాపకర్థం నిర్వహించిన కబడ్డీ క్రీడోత్సవాల్లో ఉత్తమం ప్రతిభ కనపరిచిన నాగారం మండలం పోలీస్ టీం కు గురువారం స్థానిక సర్పంచ్ భయ్యం సుజాత -వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో నాగారం సర్కిల్ సీఐ నాగేశ్వరావుకు షీల్డ్ మెమోంటం అందచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం ఉన్న యువత లో ప్రతిభ ను గుర్తించేందుకు గ్రామ స్థాయి క్రీడలు నిర్వహించడంఅభినందనీయం అని కొనియాడారు. అనంతరం ఉత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన పోలీస్ టీం ను సీఐ అభినందించారు. ఈ కార్యక్రమం లో నాగారం, ఎస్సై లు చిరంజీవి, వెంకట్ రెడ్డి,నాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకట బిక్షం,తుంగతుర్తి నియోజకవర్గం సోషల్ మీడియా కోర్డినేటర్ కొలిపాక సాయి కుమార్, నాగారం బంగ్లా ఉప సర్పంచ్ చీరిక నరేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు యల్మాకంటి సోమన్న, యూత్ కాంగ్రెస్ బంగ్లా అధ్యక్షులు గుద్దేటి సురేష్ టోర్నమెంట్ నిర్వాహకులు కన్నెబోయిన బుచ్చిబాబు, బంధారపు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పిదాలకు తావు లేకుండా గడువులోగా పూర్తి

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**విశ్వంభర, సంగారెడ్డి:** ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) ప్రక్రియను నిర్ణీత గడువులో తప్పిదాలకు తావు లేకుండా పూర్తి చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈఆర్‌వోలు పర్యవేక్షణ చేపట్టి, ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్‌వోలు, సూపర్వైజర్లకు స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, క్షేత్రస్థాయిలో ప్రక్రియ వేగంగా సాగేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేశామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలకు కేటీఆర్ పిలుపు

### కేసీఆర్ విచారణకు సిట్ సిద్ధం
### నందీనగర్ వేదికగా సిట్ విచారణ
### 12 వేల గ్రామాల్లో నిరసనలు, ఆందోనలు




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఫోన్ ట్యాపింగ్ కేసు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విచారించేందుకు సిట్ అధికారులు సిద్ధమవడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఇప్పటికే పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను విచారించిన సిట్ అధికారులు, ఆదివారం కేసీఆర్‌ను విచారించనున్నారు. మొదట ఎర్రవల్లి నివాసంలో విచారణపై సందిగ్ధత నెలకొన్నప్పటికీ, తాజా పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని నందీనగర్ నివాసంలోనే విచారణకు హాజరు కావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. శనివారం బీఆర్ఎస్ ముఖ్య నేతలు, న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. చట్టం పట్ల గౌరవంతో విచారణకు సహకరించాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు కేటీఆర్ పిలుపు..**

మరోవైపు, కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 12 వేలకు పైగా గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గ కేంద్రం, మున్సిపల్ వార్డుల్లో నల్లజెండాలతో భారీ ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ధర్నాలు నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు క్షేత్రస్థాయిలో ఈ పోరాటంలో పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే మాజీ సీఎంను వేధిస్తోందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా మన నిరసనను వినిపిద్దామని చెప్పారు. ఎక్కడా పోలీసులతో ఘర్షణ పడకుండా, శాంతియుతంగా ఈ కార్యక్రమాలు జరగాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఒకవైపు సిట్ అధికారులు కేసీఆర్‌ను ప్రశ్నించేందుకు సిద్ధమవుతుండటం, మరోవైపు బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున రోడ్లపైకి రానుండటంతో తెలంగాణవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది. ప్రధానంగా హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసం వద్ద పోలీసు యంత్రాంగం భారీ భద్రతను ఏర్పాటు చేస్తోంది.

# కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్పుల కలకలం

### ఎస్బీఐ ప్రధాన కార్యాలయం వద్ద దుండగుల బీభత్సం
### వ్యాపారిపై కాల్పులు జరిపి రూ. 6 లక్షల దోపిడీ
### దుండగుల కోసం గాలిస్తున్న 5 ప్రత్యేక బృందాలు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్‌లోని అత్యంత రద్దీగా ఉండే కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో శనివారం ఉదయం కాల్పులు కలకలం రేపింది. ఎస్బీఐ ప్రధాన కార్యాలయం సమీపంలో పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. ఓ వ్యాపారిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపి, ఆయన వద్ద ఉన్న రూ. 6 లక్షల నగదును ఎత్తుకెళ్లారు.

**ఏం జరిగిందంటే?**

నాంపల్లికి చెందిన వస్త్ర వ్యాపారి రిషద్ (కేరళ వాసి) శనివారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో రూ. 6 లక్షల నగదును ఏటీఎంలో డిపాజిట్ చేసేందుకు కోఠి బ్యాంక్ స్ట్రీట్‌కు చేరుకున్నారు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఇద్దరు దుండగులు బైకుపై వచ్చి అతడిని చుట్టుముట్టారు. నగదు బ్యాగును లాక్కునే క్రమంలో రిషద్ ప్రతిఘటించడంతో, దుండగులు తమ వద్ద ఉన్న నాటు తుపాకీతో రిషద్ కాలిపై కాల్పులు జరిపారు. తూటా తగలడంతో రిషద్ కుప్పకూలిపోగా, నిందితులు బ్యాగుతో సహా స్కూటీపై పరారయ్యారు. తీవ్ర రక్తస్రావమైన రిషద్‌ను స్థానికులు, పోలీసులు వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని, పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు.

**క్లూస్ టీమ్స్ రంగ ప్రవేశం**

ఘటనాస్థలిని ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ ఆనంద్ సందర్శించారు. క్లూస్ టీమ్స్ ఘటనాస్థలంలో బుల్లెట్ షెల్స్, ఇతర ఆధారా లను సేకరించాయి. సుల్తాన్ బజార్ పోలీసులు ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

దుండగులను వదిలే ప్రసక్తే లేదని డీసీపీ శిల్పవల్లి తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామని తెలిపారు. రద్దీగా ఉండే ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు.